క్లుప్తంగా

కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



తొస్సిపూడిలో కొలువైన కనకదుర్గమ్మ

బిక్కవోలు: తొస్సిపూడి గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం జరిపారు. అనంతరం సాయంత్రం అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు.

దాతల సహకారం అభినందనీయం



దాతలు అందించిన బహుమతులతో విద్యార్థులు

పెదపూడి: విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని జి.మామిడాడ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.వెంకటరెడ్డి అన్నారు. ఈ పాఠశాల్లో శనివారం స్థానికుడు కర్రి శ్రీనివాసరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్, పాటు, మాతృభాషా దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న సుమారు 125 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. అలాగే మధ్యాహ్న భోజనంలో విద్యార్థులందరికి స్వీట్లు, ఇతర ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్ పర్సన్ వల్లు రోహిణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుదాం



రాజానగరంలో పారిశుధ్య కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

రాజానగరం: గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే, ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతమణి అన్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని 300 పంచాయతీలలో రెండు రోజుల పాటు అమలు చేస్తే స్పెషల్ డ్రైవ్‌ను శనివారం రాజానగరం నుంచి ప్రారంభించారు. ఈ రెండు రోజులు ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించడం నూరు శాతం జరగాలన్నారు. అలాగే గ్రామాలలో చెత్త కుప్పలను తొలగించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని పీఆర్ వన్ యాప్ లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ ఎం.నాగలత, మండల ఈఓపీఆర్డీ వై.వాణి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కూటమి

మధురపూడి: ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కూటమి అభ్యర్థులను తిరస్కరించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల స్వతంత్ర్య ఎమ్మెల్సీ అభ్యర్థి కాళ్లూరి కృష్ణ మోహన్ అన్నారు. ఆయన శనివారం కోరుకొండ మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని పట్టభద్రులను కోరారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు భృతిని ప్రభుత్వం విస్మరించిందన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు జరపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీల కనుసన్నల్లో నడుచుకునే అభ్యర్థుల వల్ల ఒరిగేదేమీ ఉండదన్నారు.

పొడి, తడి చెత్తపై అవగాహన



ర్యాలీ చేస్తున్న ఈఓపీఆర్డీ మూర్తి తదితరులు

సీతానగరం: మండలంలోని కాటవరం, జాలిమూడి, మునికూడలి గ్రామాల్లో ఈఓపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి ఆధ్వర్యంలో శనివారం పొడి, తడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ సిబ్బందితో కలిసి ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచడం వల్ల సంపద కేంద్రాల్లో ఆర్గానిక్ ఎరువులు తయారు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అతి వేగం.. ప్రాణాంతకం

- రహదారి నిబంధనలు పాటించాలి
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- ఉత్సాహంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలు



రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన వాహనం (ఫైల్)



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సత్య కిషోర్ (ఫైల్)

సీతానగరం: వాహనాలు నడిపే సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. అతి వేగం, విరామం లేని ప్రయాణంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి నియమ, నిబంధనలు సక్రమంగా పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలను కట్టడి చేయవచ్చు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా రవాణా, పోలీసు శాఖలు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. దీనిలో భాగంగా రోడ్డు భద్రతా మాసోత్సవాల పేరుతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తూ, ప్రజలను చైతన్య పరుస్తున్నాయి.

నియోజకవర్గంలో..

రాజానగరం నియోజకవర్గంలో ఇటీవల పలు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. గత నెలలో సింగవరానికి చెందిన ఓ యువకుడు స్కూటీపై వెళుతుండగా రామచంద్రపురం జగనన్న కాలనీ వద్ద ఎదురుగా బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే చినకొండేపూడికి చెందిన యువకుడు బొబ్బిల్లంక వద్ద ట్రాలీని ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించి ప్రమాదవశాత్తూ దాని కింద పడి మృతి చెందాడు. నిర్లక్ష్య డ్రైవింగ్, అతి వేగం, మద్యం తాగి వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కండీషన్‌లో లేని వాహనాలను వినియోగించడం, అతి వేగంగా నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం తదితర వాటి కారణంగానే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటిలో దాదాపు 80 శాతానికి పైగా ఘటనలు కేవలం మానవ తప్పిదాలతోనే జరిగినట్లుగా తెలుస్తోంది.

అప్రమత్తత అవసరం

వాహనాలు నడిపేవారు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. వాహనాన్ని నిర్దేశిత పార్కింగ్ స్థలాల్లోనే నిలపాలి, మద్యం, ఇతర మాదక ద్రవ్యాలు వినియోగించి డ్రైవింగ్ చేయరాదు. పాదచారులు రోడ్డు దాటుతున్నప్పుడు వాహనాన్ని ఆపాలి. బ్లైండ్ కార్నర్లలో ఓవర్ టేక్ చేయరాదు. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించరాదు. రాత్రి ప్రయాణంలో డిమ్మర్ ఉపయోగించాలి. లైసెన్స్, వాహన పత్రాలను ఎల్లప్పుడూ వెంట తీసుకెళ్లాలి. వాహనాన్ని బయటకు తీసే ముందు ఒక్కసారి దాని పరిస్థితిని పరిశీలించాలి. వాహనంలో ప్రథమ చికిత్సకు అవసరమైన సామగ్రిని ఉంచాలి.

ప్రాణదాతలకు పారితోషికం

ప్రమాదాల్లో క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్పించడానికి చాలా మంది భయపడుతుంటారు. కేసుల పేరుతో పోలీసులు ఇబ్బంది పెడతారని భావిస్తారు. కానీ అవి నిజం కావు. ఇలాంటి భయాలను పక్కన పెట్టి, క్షతగాత్రులను గోల్డెన్ అవర్ లోపు కాపాడాలి. ఇలా ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకువెళ్లిన వారికి కేంద్ర ఉపరితల రవాణా శాఖ రూ.5 వేలు ప్రోత్సాహకంగా అందజేస్తుంది. అలాగే ప్రాణదాత (గుడ్ సమారిటన్) పేరుతో పోలీసు శాఖ నుంచి సర్టిఫికెట్ కూడా వస్తుంది. ఉత్తమ ప్రాణదాతలుగా నిలిచిన పది మందికి జాతీయ స్థాయిలో రూ.లక్ష చొప్పున రివార్డును ఇస్తారు.

నిర్లక్ష్యం వీడాలి



వాహనాలు నడిపే సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. దూర ప్రయాణం చేసే సమయంలో మార్గం మధ్యలో డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవాలి. కేవలం ర్యాష్ డ్రైవింగ్ వల్లనే ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఆటో డ్రైవర్లు, వాహన చోదకులకు అవగాహన కల్పించాం.

– వై. సత్య కిషోర్, కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం



ఈలకొలనులో సర్వే చేస్తున్న టీమ్ సభ్యులు

రంగంపేట: బాల్య వివాహాలు ప్రోత్సహించడం నేరమని మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాది మడికి రాంబాబు అన్నారు. బాల్య వివాహాలపై అవగాహన, దివ్యాంగుల యోగక్షేమాలపై ఇంటింటా సర్వే కోసం ఏర్పాటు చేసిన బృందం శనివారం ఈలకొలనులో పర్యటించింది. ఈ సందర్భంగా దివ్యాంగుల యోగక్షేమాలు, వారికి అందుతున్న వైద్యం, ప్రభుత్వ పథకాలు, సదరన్ సర్టిఫికెట్లపై సర్వే చేసింది. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేసింది. పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రిపేరు, సర్వీసింగ్‌లో శిక్షణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 25వ తేదీ నుంచి సెల్‌ఫోన్ రిపేరు, సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు తెలిపారు. 0883–242024, 2428807, 97013 59954, 90143 28803ను సంప్రదించాలన్నారు.

క్షయ వ్యాధి రహిత దేశంగా తీర్చిదిద్దాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీహెచ్‌ఓ శారద

పెదపూడి: క్షయ వ్యాధి రహిత దేశంగా చేయడానికి అందరూ కృషి చేయాలని పెద్దాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సీహెచ్ఓ శారద అన్నారు. పెదపూడిలోని గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ క్షయ లక్షణాలపై ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉండడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, ఛాతీలో నొప్పి, దగ్గినప్పుడు కఫంలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే దానిని క్షయ వ్యాధిగా అనుమానించాలన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఇద్దరికి క్షయ వ్యాప్తి చెందుతోందన్నారు. సకాలంలో మందులు వాడకపోతే ప్రమాదమన్నారు. ఈ వ్యాధి సోకిన రోగి మందులు వాడినంత కాలం ప్రభుత్వం నెలకు రూ.500 చొప్పున వారి బ్యాంకు ఖాతాకు జమచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ సీహెచ్‌వీ హనుమంతరావు, పెద్దాడ ఆస్పత్రి సూపర్ వైజర్లు బీరా సుకుమార్, బీరా విజయ మోహన్ కుమార్ పాల్గొన్నారు.

క్యాన్సర్ వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

బిక్కవోలు: మండల పరిధిలోని బలభద్రపురంలో శనివారం నిర్వహించిన క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆ వ్యాధి బాధితులు అధికంగా ఉంటడంతో గ్రామస్తులు, పెద్దలు, నాయకులు, యువత, పంచాయతీ సహకారంతో కాకినాడ ట్రినిటీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. డాక్టర్లు తోట అజయ్, బుద్దుల దుర్గాప్రసాద్, మోహన్ విజయ్ శిబిరంలో రోగులను పరీక్షించి మందులు అందించారు. అవసరమైన వారి నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేశారు. క్యాన్సర్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, సర్పంచ్ బుంగ రామారావు, పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌రెడ్డి, గుబ్బల లాజర్ బాబు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని ఇందిరా నగర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన సింహాచలం, కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమకూర్చిన ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ పోటీలు ప్రారంభం



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ



కలెక్టర్ ప్రశాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ వుమెన్స్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను వీసీ ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వవిద్యాలయంలో సిబ్బందికి, విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. క్రికెట్, త్రోబాల్, బ్యాడ్మింటన్, చెస్, మ్యూజికల్ చైర్స్‌తో పాటు డ్యాన్స్, పాటలు, స్కిట్లు, ఫ్యాషన్ షో, ఎలక్యూషన్, వీడియో ప్రెజెంటేషన్, పెయింటింగ్, వేస్ట్ టు వెల్త్ వంటి వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా మహిళలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, వుమెన్స్ సెల్ కో ఆర్డినేటర్ ఆచార్య ఉమామహేశ్వరీదేవి పాల్గొన్నారు.

నన్నయ వర్సిటీ అభివృద్ధికి సహకారం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. యూనివర్సిటీ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ శనివారం ఆమెను కలుసుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అభివృద్ధితో పాటు వివిధ సమస్యల పై ఉభయులూ చర్చించారు. మహిళా సాధికారతకు సంబంధించిన అంశాలపై కలిసి పనిచేద్దామన్నారు. దానికి జిల్లా అధికార యంత్రాంగం నుంచి అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. అలాగే మహిళలకు ప్రయోజనం చేకూర్చే విధంగా నూతన కోర్సులను యూనివర్సిటీలో తీసుకురావాలన్నారు.

బాధిత కుటుంబాలకు జక్కంపూడి రాజా పరామర్శ



ములకల్లంకలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జక్కంపూడి రాజా

సీతానగరం/మధురపూడి/రాజానగరం: నియోజకవర్గంలో ఇటీవల పలువురు మృతి చెందిన నేపథ్యంలో, వారి కుటుంబాలను వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శనివారం పరామర్శించారు.

- ములకల్లంకలో ఎంపీటీసీ అత్త పోలిన వెంకటరత్నం ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులను జక్కంపూడి రాజా పరామర్శించారు.
- కోరుకొండ మండలం గరగలంపాలేనికి చెందిన గురుకు నరసమ్మ, పెంటకోటి రామారావు, చప్పగడ్డి ఈశ్వరరావు, యార్లగడ్డ గన్నియ్య, కోండ్రపు వెంకటలక్ష్మి, కోలా సూరమ్మ మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.
- రాఘవపురంలో రోడ్డు ప్రమాదంలో తలకు గాయమై విశ్రాంతి తీసుకుంటున్న పి.అప్పలరాజు, కన్నయ్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.
- మునగాలకు చెందిన గుమ్మడి భాస్కరరావు, తాడిమల్లి, రమణ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.
- నిడిగట్లలో తండ్రిని కోల్పోయిన దార గోపీని, భార్యా వియోగంతో బాధపడుతున్న వల్లభశెట్టి రాంబాబును పరామర్శించారు.
- రాజానగరం మండలం తూర్పుగానుగూడెంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గోడ్డు రామ్మూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు.
- తిమ్మనపూడి శ్రీను కుమారుడు రామకృష్ణ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.
- పల్ల కడియానికి చెందిన కందుల గోవింద్ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మెరుగైన ప్రీ ప్రైమరీ విద్యనందించాలి



పెదపూడిలో మాట్లాడుతున్న సీడీపీఓ జ్యోతి

పెదపూడి: అంగన్‌వాడీ పిల్లలకు మెరుగైన ప్రీ ప్రైమరీ విద్యను అందించి, కేంద్రాల్లో నమోదు శాతాన్ని పెంచడానికి కృషి చేయాలని కాకినాడ అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఏ.జ్యోతి అన్నారు. పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు నాలుగో రోజు శిక్షణ కొనసాగింది. ముఖ్య అతిథులుగా ఏ.జ్యోతి, ఎంఈఓ–1, 2 కె.సత్యనారాయణ, సీవీవీ సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ ఆరేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు ఆటపాటలతో విద్యను అందించే విషయమై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు సాయి వెంకటేష్, ఏఏఎస్ఎన్ లోవరాజు, ఆర్.శ్రీనివాస్, వై.శ్రీగౌరీ, సీహెచ్. శ్రీపద్మ పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలి



శిక్షణలో తయారు చేసిన ఆకృతులను ప్రదర్శిస్తున్న కోర్సు డైరెక్టర్ పార్థసారథి

రంగంపేట: తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆకర్షణీయమైన తరగతి గది అలంకరణలు, బోధనోపకరణాలను తయారు చేయడంలో నైపుణ్యాన్ని పెంచుకోవాలని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు, కోర్సు డైరెక్టర్ వి.పార్థసారథి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి నాలుగో రోజు శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. చిన్నారుల భావోద్వేగాలు గుర్తించడం, మంచి అలవాట్లు పెంచడం, బాల్యం నుంచి ప్రయోగాత్మకంగా తీర్చిదిద్దాలని సూచించారు. డీఆర్పీలు కె.రాజు, ఎన్వీ రమణాంజలి, వి.త్రిమూర్తిరాజు తదితరులు అంగన్ వాడీ కార్యకర్తలో పలు వస్తువులను తయారు చేయించారు. శ్రీకృష్ణపట్నం రామచంద్ర మిషన్‌కు చెందిన యోగా గురువు ఇ.రాంబాబు ధ్యాన సాధన, యోగాభ్యాసాలపై శిక్షణ ఇచ్చారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన



సీతానగరం వెలమపేటలో గ్యాస్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఏజెన్సీ సిబ్బంది

సీతానగరం: గ్యాస్ వినియోగం, భద్రతపై శనివారం సీతానగరంలో జయ రోహన్ ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ కె.రఘు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద గల కమ్యూనిటీ హాలు, వెలమపేటలో ఈ కార్యక్రమాలు జరిగాయి. రఘు మాట్లాడుతూ గ్యాస్ ట్యూబ్‌ను ఐదేళ్లకు ఒకసారి మార్చాలని, వాడుతున్న గ్యాస్ సిలెండర్ పక్కనే మరో ఫుల్ సిలిండర్ ఉంచరాదని, సిలెండర్ డెలివరీ చేసుకున్న తక్షణమే ఓరింగ్ చెక్ చేయించుకోవాలని సూచించారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న సంపర వేంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపరలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పంచామృతాభిషేకాలు, నిర్వహించారు. అర్చకులు ఖండవిల్లి శ్రీనివాసాచార్యులు, ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్వామికి సాహస తులసీ దళాలతో, అమ్మవారికి శ్రీచూర్ణంతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తుల సామూహికంగా గోవిందనామా పారాయణం చేశారు. రంగంపేట: చంద్రేడు గ్రామంలోని సచివాలయం వద్ద కొలువైన పద్మావతి, అలివేలు మంగా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఘనంగా 'అంతరంగం' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సామాజిక స్పృహ కలిగిన శ్రీపాద శ్రీనివాస్ తన పుస్తక రచనను కొనసాగించాలని పలువురు వక్తలు అన్నారు. హరిచందన పబ్లికేషన్స్ పక్షాన గజరావు వెంకటేశ్వరరావు సారథ్యంలో ఆయన రాసిన అంతరంగం పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ప్రకాశం నగర్‌లోని ధర్మంచర కమ్యూనిటీ హాలుపైన గల బుక్ బ్యాంకులో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో శ్రీపాద పుస్తకావిష్కరణ ఇంతమంది ఆత్మీయుల నడుమ జరగడం ఆనందంగా ఉందన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ శ్రీనివాస్ తన మంచితనం కారణంగానే ఇంతమంది ఆదరణ పొందగలిగాడన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం హుకుంపేటలోని వల్లీ నగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన నంది సాయికృష్ణ మనోజ్ (35) రాజమహేంద్రవరంలోని ఎల్అండ్‌టీ ఫైనాన్స్ లిమిటెడ్‌లో ఏరియా సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడు. భార్యతో కలిసి హుకుంపేట వల్లీనగర్‌లోని ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. వారికి వివాహమై ఏడేళ్లు అయినప్పటికీ సంతానం లేదు. ఇటీవల అతడి భార్యకు మూడో నెలలో గర్భం పోయింది. దీంతో ఆమె వారం రోజుల క్రితం తన తల్లిదండ్రుల వద్దకు విజయవాడ వెళ్లింది. అప్పటి నుంచి సాయి కృష్ణ మనోజ్ ఒక్కడే ఇంటిలో ఉంటున్నాడు. అయితే రెండు రోజుల నుంచి మనోజ్ సెల్‌ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అతడి స్నేహితులు శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి వెళ్లి చూడగా చున్నీతో ఉరి వేసుకుని ఉన్నాడు. ఈ మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు.